నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, శనివారం 19 ఏప్రిల్ 2025 | JANAGAON

# మహాసభ గొప్పగా..

రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై ఎర్రవెల్లిలో ఉమ్మడి వరంగల్ జిల్లా, బీఆర్ఎస్ మహిళా నేతలతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశం

- లక్షలాది మందికి అనుగుణంగా ఏర్పాట్లు
- రజతోత్సవ సభపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమీక్ష



వరంగల్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు ఘనంగా ఉండాలని అధినేత కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను ఆదేశించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న మహాసభ బీఆర్ఎస్ గతంలో నిర్వహించిన సభల కంటే గొప్పగా ఉంటుందని చెప్పారు. లక్షలాదిగా వచ్చే ప్రజలకు అవసరమైన ఏర్పాట్లను సమగ్రంగా చేయాలని, వసతుల విషయంలో రాజీపడొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొన్నదని, బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు జనం నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతున్నదని చెప్పారు. అన్ని వర్గాల వారు ఎల్కతుర్తి సభకు హాజరుకానున్నారని, ఈమేరకు మహాసభ వద్ద వసతులు కల్పించాలని సూచించారు. రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు, సభలో మహిళలకు ప్రత్యేక వసతులు, సభ విజయవంతంలో మహిళల భాగస్వామ్యం, సభ సక్సెస్ కోసం అనుసరించాల్సిన కార్యాచరణపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం ఎర్రవెల్లిలోని నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమీక్షించారు. సభా వేదిక, లక్షలాదిగా వచ్చే ప్రజలకు సభా స్థలంలో ఏ చిన్న ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది వాహనాల్లో జనం రానున్నారని, పార్కింగ్ నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. అత్యవసర సేవల విషయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీశ్ కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చంద్రావతి, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, టీఎస్పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, బీఆర్ఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, రజినీ సాయిచంద్, జక్కు శ్రీహర్షిణి, కల్వకుంట్ల వంశీధర్‌రావు, నవీనాచారి, హరి రమాదేవి పాల్గొన్నారు.

- చలో పోదాం.. బీఆర్ఎస్ రజతోత్సవం




*ఎల్కతుర్తి వేదికగా జరగబోయే బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగ కోసం ప్రచారం జోరందుకున్నది. అటు సభాస్థలిలో ఏర్పాట్లను ఉమ్మడి జిల్లా నేతలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనుల్లో వేగం పెంచడమే గాక సభ విజయవంతం కోసం జిల్లాల్లో సన్నాహక సమావేశాలతో శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సందర్భ ంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని 17వ వార్డు సుభాష్‌కాలనీ, న్యూ సుభాష్ కాలనీలో కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్ వాల్‌రైటింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలకు ఆహ్వానం పలుకుతున్నారు.*

*- జయశంకర్ భూపాలపల్లి ఫొటోగ్రాఫర్*

## కేసీఆర్ మానస పుత్రిక సీతారామ ప్రాజెక్టు



గార్లలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

గార్ల, ఏప్రిల్ 18 : కేసీఆర్ మానస పుత్రిక సీతారామ ప్రాజెక్టు అని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శుక్రవారం గార్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రాంత రైతులకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరందించేందుకు చట్ట సభల్లో మాట్లాడి, పోరాటం చేస్తామన్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు నియోజకవర్గాలకు సాగు, తాగు నీరందించేందుకు కృషి చేస్తామన్నారు. 15 నెలలుగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. గార్లలో శాతవాహన, ఇంటర్ సిటీ, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కల్పించాలని అఖిల పక్ష నాయకులు కోరారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని రవిచంద్ర చెప్పారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు పూలమాల, శాలువాతో ఆయనను సన్మానించారు. ఈ నెల 27వ తేదీన జరిగే ఎల్కతుర్తి రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు మీగడ శ్రీనివాస్, పానుగంటి రాధాకృష్ణ, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

## సభ ఏర్పాట్లు ముమ్మరం..

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సభాస్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తూ నాయకులకు సూచనలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎల్కతుర్తిలో సభాస్థలిని శుక్రవారం సాయంత్రం నెక్కొండ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, సభా ఏర్పాట్లు పరిశీలించి నెక్కొండ బీఆర్ఎస్ నాయకులు చేపట్టాల్సిన పనులు, నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజల తరలింపు తదితర అంశాలపై సమీక్షించారు. బీఆర్ఎస్ హయాంలో నర్సంపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిచిందని, కొత్త కొత్త పథకాలకు ఇక్కడి నుంచే కేసీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు గుర్తుచేస్తూ కాంగ్రెస్ హయాంలో తెలంగాణ వెనుకబడుతున్న తీరుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట నెక్కొండ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ లావుడ్యా సరోజ-హరికిషన్, మాజీ వైస్ ఎంపీపీ దొనికెన సారంగపాణి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు గాదె భద్రయ్య, బొల్లెబోయిన వీరస్వామి, మాజీ సర్పంచ్ బదావత్ స్వరూప-రవి, బక్కి కుమారస్వామి, మాతంగి రాజు పాల్గొన్నారు.

## భారీ సభలకు పెట్టింది పేరు బీఆర్ఎస్



సభా మైదానాన్ని పరిశీలిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్

- చరిత్రలో నిలిచిపోయేలా ఎల్కతుర్తి సభ
- కేసీఆర్ మాట విని స్ఫూర్తి పొందేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నరు
- 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన ఘనత మాదే..
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 18 : భారీ సభలకు పెట్టింది పేరు బీఆర్ఎస్ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్కతుర్తిలోని భారీ బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో అద్భుతమైన సభలు నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల్లో అడుగు పెడుతున్న సందర్భంగా ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రజలందరు కూర్చోడానికి సీట్లు, మహిళలకు టాయిలెట్స్, లక్షల మజ్జిగ, వాటర్ ప్యా కెట్లు సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. నియోజకవర్గాల వా రీగా వాహనాల పార్కింగ్‌కు గూగుల్ పాయింట్ల ను సైతం అందించనున్నట్లు వివరించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను 10 సంవత్సరాల కాలంలో కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తే, అలవికాని హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి సర్కారు 16 నెలల్లో తెలంగాణను మళ్లీ తెర్లు చేస్తుందని పేర్కొన్నారు. పండిన పంటను కొనే తెలివి లేదని, కొనుగోలు కేంద్రాలు ఓపెన్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పుడు 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని చెప్తున్నారని, అది మీరు చేసింది కాద ని గుర్తుంచుకోవాలని సూచించారు. 2014 లో 24లక్షల మెట్రిక్ టన్నులు పండితే, 2023 తాము దిగిపోయే వరకే దాన్ని 141లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి ఎఫ్‌సీఐకి అందించామని, మరో కోటి 60 లక్షల మెట్రిక్ టన్నులు తినడానికి, ఇతర అవసరాలకు అందించిన ఘన త కేసీఆర్‌ది అన్నారు. కేసీఆర్ 46 వేల చెరువులకు మరమ్మతులు చేసి, రిజర్వాయర్లు కడితే సాధ్యమైందన్నారు. అంతేకాకుండా రూ. 72 వేల కోట్లను రైతుబంధు కింద అందించామని, లక్షా 50వేల మందికి రైతుబీమా అందించి రైతులను ఆదుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపి రాష్ట్రాన్ని సాధించి విజయతీరాలను ముద్దాడిన పార్టీ బీఆర్ఎస్ అని, మళ్లీ ఇప్పుడు కేసీఆరే రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్ మాట విని మళ్లీ స్ఫూర్తి పొందాలని ప్రజలంతా ఈ సభ కోసం ఎదురు చూస్తున్నారని, సభకు వాహనాలు సమకూర్చితే తామే స్వచ్ఛందంగా వస్తామని చెప్తున్నారని పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలు ముందుగానే 4గంటల వరకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, గ్రౌండ్ ఇన్‌చార్జిలు భర త్‌కుమార్‌రెడ్డి, వెంకన్న, నాయకులు ఎల్తూరి స్వామి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, దుగ్యాని సమ్మయ్య, చిట్టిగౌడ్, భగవాన్ పాల్గొన్నారు.



రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎర్రబెల్లి, నాయకులు

## కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- రజతోత్సవ సభ వైపే ప్రపంచం చూపు..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, ఏప్రిల్ 18 : రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షల మేరకు పురుడుపోసుకున్న గులాబీ జెండా, కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం రాయపర్తిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి వర్గ విస్తరణ తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రి మారుడో.. ప్రభుత్వం కూలుడో జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి గులాబీ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎర్రబెల్లి కోరారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే తాము అభాసుపాలవుతామన్న భావనతోనే ఎన్నికల నిర్వహణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాహసించడం లేదని ఆయన మండిపడ్డారు. ఉద్యమ రథ సారథి కేసీఆర్ నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఏం అద్భుతాలు జరుగుతాయో.. గులాబీ బాస్ ఏం ప్రసంగిస్తాడోనని ప్రపంచమంతా ఎల్కతుర్తి సభ వైపే ఉరకలేత్తే ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, గుడిపూడి గోపాల్‌రావు, నాయకులు జినుగు అనిమిరెడ్డి, పూస మధు, గారె నర్సయ్య, లేతాకుల రంగారెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, కుందూరు రాంచంద్రారెడ్డి, గుగులోత్ జాజునాయక్, మహ్మద్ అక్బర్, పారుపల్లి సుధాకర్‌రెడ్డి, గాజులపాటి నర్మద, భూక్యా క్రాంతి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ముద్రబోయిన సుధాకర్, చందు రామ్‌యాదవ్, సతీశ్‌యాదవ్, ఉబ్బని సింహాద్రి, భూక్యా సురేందర్‌రాథోడ్‌నాయక్, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, చిన్నాల ఉప్పలయ్య, చిలువేరు సాయిగౌడ్, మండల శ్రీధర్, చిట్యాల వెంకటేశ్వర్లు, జయశ్రీ, బొడ్డు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

- దాస్యం వినయ్‌భాస్కర్
- 9, 10 డివిజన్లలో కరపత్రాల పంపిణీ

## కేసీఆర్ పాలన స్వర్ణయుగం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 18 : కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగమని, ప్రజాసంక్షేమం, అభివృద్ధి రెండు జోడెడ్ల వలె సాగాయన్నారు. తెలంగాణలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శమయ్యాయని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం 9వ డివిజన్‌లో మాజీ డిప్యూటీ మేయర్ ఖాజా సిరాజుద్దీన్, 10వ డివిజన్ అధ్యక్షుడు పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో మచిలీబజార్, రాగన్నదర్వాజ, చౌరస్తాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం మాట్లాడుతూ 16 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో ప్రజలు మళ్లీ కేసీఆరే రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిందని రానున్న రోజుల్లో ఎగరబోయేది గులాబీ జెండాయేనని ఆయన ఆశాభా వం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం కొట్లాడింది కేసీఆర్, గులాబీ సైన్యమని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్క తుర్తి మహాసభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హనుమకొండ చౌరస్తాలోని వ్యాపార సముదాయాలు, ప్రజలకు సభ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ రోడ్డు హనుమాన్ గుడి వద్ద బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. డప్పు కళాకారుల మోతల నడుమ గులాబీ శ్రేణులు, మహిళలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు.



హనుమకొండ చౌరస్తాలో రజతోత్సవ సభ గురించి తెలిపే కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

## వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

- న్యాయం చేయాలని ఎన్‌హెచ్‌పై బైఠాయించిన కుటుంబసభ్యులు
- మంత్రులు వస్తున్నారని లాగి పక్కకు నెట్టిన పోలీసులు
- బిడ్డ మృతదేహాన్ని ఎత్తి చూపించినా గోడు వినని వైనం



పసికందు మృతదేహం



జాతీయ రహదారిపై బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగిన పోలీసులు

ములుగు, ఏప్రిల్18(నమస్తేతెలంగాణ) : వైద్యుల నిర్లక్ష్యంతో పురిట్లోనే బిడ్డ మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన బిళ్ల చందు భార్య రవళికి మొదటి కాన్పులో భాగంగా ములుగు ప్రభుత్వ దవాఖానలో గురువారం అడ్మిట్ చేశారు. నొప్పులు వచ్చేందుకు ఇంజక్షన్‌లు వేసి శుక్రవారం సాధారణ కాన్పు చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. తనకు నొప్పులు రావడం లేదని రవళి చెప్పినప్పటికీ వైద్యురాలు, సిబ్బంది వినకుండా చేతులతో బాగా ఒత్తడంతో పసికందు తల బయటకు రావడంతో గట్టిగా లాగారు. పుట్టింది మగ బిడ్డ అని, కండ్లు తెరవడం లేదని వీపుపై కొట్టినా చలనం లేకపోవడంతో చనిపోయినట్లు తెలిపారు. దీంతో రవళి, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని తండ్రి బిళ్ల చందుతో పాటు కుటుంబ సభ్యులు దవాఖాన ఎదుట జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. అదే సమయంలో వెంకటాపూర్ మండల కేంద్రంలో భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరయ్యేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క వెళ్తున్న క్రమంలో పోలీసులు వారిని పక్కకు లాగేయడంతో తోపులాటతో పాటు తీవ్ర వాగ్వాదం జరిగింది. అయినప్పటికీ పసికందు మృతదేహాన్ని తలపై పెట్టుకొని మంత్రులకు చూపించి నిరసన వ్యక్తం చేశారు. గమనించిన మంత్రి సీతక్క బాధ్యులపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని చెప్పి ఆగకుండా వెళ్లిపోయారు. బంధువులు రవళిని పక్కనే ఉన్న ప్రైవేట్ దవాఖానలో చికిత్స నిమిత్తం అడ్మిట్ చేశారు. మంత్రులు వాహనాన్ని ఆపి దిగి వచ్చి బాధిత కుటుంబాన్ని ఓదార్చకపోవడం పలు విమర్శలకు దారి తీసింది.

**నా బిడ్డ చావుకు ప్రభుత్వ దవాఖానే కారణం : బిళ్ల రవళి**

నాకు నొప్పులు రావడం లేదని మొత్తుకున్నా వినలేదు. ఇంజక్షన్లు వేసినా రాలేదు. కడుపు మీద చేతులు పెట్టి కిందకు నొక్కారు. ప్రాణం పోయేలా ఉంది అని చెప్పినా, ఏడ్చినా వినలేదు. చనిపోగానే శిశువు హెల్త్ కండిషన్ సరిగా లేదన్నారు. నా బిడ్డ చావుకు ప్రభుత్వ దవాఖాన, వైద్య లు, సిబ్బందే కారణం.

### భూ సమస్యల పరిష్కారానికే నూతన చట్టం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపూర్‌లో కలెక్టర్ దివాకర అధ్యక్షతన నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, నాగరాజు, ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ సుజోయ్ పాల్

## సమాజశాంతిని బాధ్యతగా తీసుకోవాలి

హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్

హనుమకొండ, ఏప్రిల్ 18: సమాజంలో వ్యక్తులు, సమూహాల మధ్య వచ్చే వివాదాలను పరిష్కరించి శాంతియుత సమాజ స్థాపనకు కమ్యూనిటీ పెద్దలు నడుంబిగించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ వివాదమైనా వ్యక్తికి వ్యక్తి మధ్యనో లేదా వ్యక్తుల సమూహాల మధ్యనో ఏర్పడుతుందన్నారు. అయితే ఆ వ్యక్తి గానీ, సమూహం గానీ ఏదో ఒక కమ్యూనిటీకి చెందినదై ఉంటుందని, అలాంటి పరిస్థితిల్లో అదే కమ్యూనిటీకి చెందిన పెద్దలు వారికి నచ్చచెబితే వివాదాలు శాంతియుత వాతావరణంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ బృహత్తర ఆలోచన నుంచి ఉద్భవించినదే కమ్యూనిటీ మీడియేషన్ విధానమన్నారు. మొదటిసారిగా కేరళ రాష్ట్రంలో, ఆ తర్వాత మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కూడా విజయవంతమైందన్నారు. 2023లో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందన్నారు. ముఖ్యంగా కొన్ని దశాబ్దాలుగా భార్యాభర్తలు, తల్లిదండ్రులు, పిల్లల మధ్య తగాదాలు పెరిగిపోతున్నాయని, వీటికి చక్కటి పరిష్కారం కమ్యూనిటీ మీడియేషన్ అని అన్నారు. న్యాయస్థానాల్లో కేసులు ఉంటే, ఇరుపక్షాల్లో ఒకరు గెలిస్తే మరొకరు పై కోర్టుకు వెళ్తారని, కానీ, కమ్యూనిటీ మీడియేషన్ విధానంలో వివాదం పరిష్కారమైతే వ్యక్తులే కాకుండా కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని, ఇలాంటి గురుతర బాధ్యతను పెద్దలు తమ భుజస్కంధాల మీద వేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో విశ్రాంత వైస్ చాన్స్‌లర్ కమ్యూనిటీ మీడియేటర్‌గా సాధించిన విజయాలను వివరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌లో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు విజయవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత ఏప్రిల్ 7వ తేదీన కామారెడ్డిలో ఒకేసారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు బీవీ నిర్మల గీతాంబ, సీహెచ్ రమేశ్‌బాబు, ఇతర జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు సాయికుమార్, క్షమా దేశ్‌పాండే పాల్గొన్నారు.

### కాజీపేట మీదుగా వారాంతపు వేసవి ప్రత్యేక రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 18: కాజీపేట రైల్వేజంక్షన్ మీదుగా పలు వేసవి వారాంతపు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి– డెహ్రాడూన్–చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య, బిలాస్‌పూర్–కాచిగూడ–బిలాస్‌పూర్ స్టేషన్ల మధ్య రెండు రైళ్లు 20 ట్రిప్పులు నడుపుతున్నట్లు తెలిపారు. 07077 నంబర్‌తో చర్లపల్లి స్టేషన్‌లో ప్రారంభమై ఈ నెల 22 నుంచి మే 27 వరకు ప్రతి మంగళవారం, 07078 నంబర్‌తో డెహ్రాడూన్ స్టేషన్‌లో షురువై 24 నుంచి మే 29 వరకు ప్రతి గురువారం బయల్దేరుతుందన్నారు. మరో స్పెషల్ రైలు 08263 నంబర్‌తో కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా వెళ్లే ట్రైన్ బిలాస్‌పూర్ స్టేషన్‌లో ప్రారంభమై మే 12 నుంచి జూన్ 2 వరకు ప్రతి సోమవారం, 08264 నంబర్‌తో కాచిగూడ రైల్వే స్టేషన్ షురువై మే 13 నుంచి జూన్ 3 వరకు ప్రతి మంగళవారం వెళ్తుందన్నారు. వేసవిలో ప్రయాణికులు ఈ స్పెషల్ రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

